ఉగ్రం.. శత్రు భయంకరం

దేశీయ రైఫిల్‌ను ఆవిష్కరించిన డీఆర్‌డీవో

- ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి
- 100 రోజుల కంటే తక్కువ వ్యవధిలోనే తయారీ
- రేంజ్ 500 మీటర్లు.. 'ఇన్సాస్' కంటే పవర్‌ఫుల్

హైదరాబాద్, జనవరి 9: కదన రంగంలో శత్రువులకు వెన్నులో వణుకు పుట్టించే దేశీయ రైఫిల్ 'ఉగ్రం'ను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఆవిష్కరించింది. డీఆర్‌డీవో ఆధ్వర్యం లోని ఆర్మమెంట్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏఆర్‌డీఈ) హైదరాబాద్‌కు చెందిన ద్వీపా ఆర్మర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో కలిసి 100 రోజుల కంటే తక్కువ వ్యవధిలోనే ఈ రైఫిల్‌ను అభివృద్ధి చేసింది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చేసిన ఆయుధం ఇదే కావడం విశేషం. 7.2 ఎంఎం క్యాలిబర్ రౌండ్లను కలిగి ఉండే ఈ రైఫిల్ మన దేశంలో సాయుధ బలగాలు విరివిగా ఉపయోగించే 'ఇన్సాస్' రైఫిల్ కంటే ఎంతో భీకరమైనది. సైనిక, పారామిలిటరీ, పోలీసు బలగాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 'ఉగ్రం' రైఫిల్‌ను అభివృద్ధి చేశారు. కార్గిల్ యుద్ధ సమయం నుంచి ఉపయోగిస్తున్న 'ఇన్సాస్' రైఫిళ్ల స్థానంలో వీటిని ప్రవేశపెట్టనున్నారు. 4 కేజీల బరువు ఉండే 'ఉగ్రం' రైఫిల్ 500 మీటర్ల రేంజ్‌ను కలిగి ఉంటుంది. ఇది దాదాపు 5 ఫుట్‌బాల్ మైదానాలంత దూరానికి సమానం. త్వరలో ఈ రైఫిల్‌ను ట్రయల్స్‌కు పంపనున్నట్టు ఏఆర్‌డీఈ డైరెక్టర్ అంకతి రాజు తెలిపారు. 7.62 ఎంఎం క్యాలిబర్ రౌండ్లను కలిగి ఉండే ఏకే-203 రైఫిళ్ల అభివృద్ధి కోసం భారత్ ఇప్పటికే రష్యాతో చేతులు కలిపింది. దీంతో ఈ రైఫిళ్లను దేశీయంగా తయారు చేసేందుకు ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఆర్ఆర్‌పీఎల్) పేరుతో ఉత్తరప్రదేశ్‌లోని కోర్వాలో ఓ జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటైంది. దాదాపు 300 మీటర్ల రేంజిని కలిగి ఉండే ఏకే-203 రైఫిళ్లు ప్రస్తుతం తయారీ, పరీక్షల దశలో ఉన్నాయి.

గుదిబండగా 5 గ్యారెంటీలు

అమలు చేయడం ఆర్థిక భారమే

కర్ణాటక సీఎం ఆర్థిక సలహాదారు బసవరాజ్ వ్యాఖ్య

వ్యయ తగ్గింపునకు స్కీమ్ రూల్స్‌లో మార్పులు చేసే యోచనలో ఉన్నాం

కాంగ్రెస్ హామీలతో అభివృద్ధి పనులు పడకేసే ప్రమాదం ఉన్నదని ఆందోళన

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): ఐదు గ్యారెంటీల ప్రచారంతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వాటి అమలు తలకుమించిన భారంగా మారిపోయింది. పథకాల అమలుకు ఏటా రూ. 58 వేల కోట్ల వరకు నిధులు కేటాయించాల్సి రావడం, నిజమైన లబ్ధిదారులకు గ్యారెంటీలు సక్రమంగా చేరకపోవడంతో పలు ప్రాంతాల్లో నిరసనలు పెరుగుతుండటం వెరసి అధికారపార్టీ నేతలు తలలు పట్టుకొంటున్నారు. ఈ క్రమంలో ఐదు గ్యారెంటీల అమలు సర్కారుకు గుదిబండగా మారిందని సీఎం సిద్ధరామయ్య ఆర్థిక సలహాదారు బసవరాజ్ రాయరెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. 'ఎన్నికల్లో ఇచ్చిన 5 గ్యారెంటీలను కొనసాగించాలంటే ఏటా రూ. 58 వేల కోట్లు అవసరం. ఇది ఖజానాపై పెనుభారమే. అందుకే, దీనిపై ఏం చేయాలన్న దానిపై చర్చలు జరుపుతున్నాం. ఒకవైపు గ్యారెంటీలను అమలు చేస్తూనే, వ్యయాన్ని తగ్గించుకోడానికి స్కీమ్ నిబంధనల్లో ఏమేం మార్పులు చేర్పులు తీసుకురావొచ్చో చర్చిస్తున్నాం. గ్యారెంటీలను అమలు చేయడానికి కావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు ఒక ఆర్థిక సలహాదారుగా అవసరమైన కార్యాచరణను రూపొందిస్తున్నా' అని రాయరెడ్డి అన్నారు. ఈ మేరకు ఇంగ్లిష్ న్యూస్ చానల్ రిపబ్లిక్ టీవీతో మాట్లాడారు.

బసవరాజ్ రాయరెడ్డి

సీఎం సిద్ధరామయ్య

కుంటుపడనున్న అభివృద్ధి

ఎన్నికల్లో ఇచ్చిన 5 హామీలను అమలు చేయడానికి నిధులను ఖర్చు చేసుకుంటూ పోతే అభివృద్ధి పనులు పడకేయడం ఖాయమన్న ఆందోళనను కూడా రాయరెడ్డి వ్యక్తం చేశారు. ఇదే అభిప్రాయాన్ని గతంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మరో మంత్రి శరనబసప్పా దర్శనపూర్ కూడా వ్యక్తం చేయడం గమనార్హం. సిద్ధరామయ్య సర్కారు తీసుకొచ్చిన 5 గ్యారెంటీలను అమలు చేయాలంటే ఖజానాపై రూ. 40 వేల కోట్ల నుంచి రూ. 50 వేల కోట్ల వరకూ భారం పడుతుందని, అందుకే తొలి ఏడాది ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు ప్రారంభించకపోవచ్చని గత జూన్‌లో శరనబసప్పా అన్నారు. 5 గ్యారెంటీల కారణంగా నియోజకవర్గాల్లో తొలిఏడాది అభివృద్ధి పనులు జరుగకపోవచ్చని గత జూలైలో డీకే ఎమ్మెల్యేల సమావేశంలో పేర్కొన్నారు.

జూలై 7న నీట్ పీజీ పరీక్ష

న్యూఢిల్లీ, జనవరి 9: నీట్-పోస్ట్ గ్రాడ్యుయేట్ పరీక్షను ఈ ఏడాది జూలై 7కు రీషెడ్యూల్ చేసినట్టు జాతీయ పరీక్షల బోర్డు మంగళవారం తెలిపింది. ఈ పరీక్షకు అర్హత కటాఫ్ తేదీని ఆగస్ట్ 15గా నిర్ణయించింది. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్ష మార్చి 3న నిర్వహించాల్సి ఉన్నది. అయితే తాజాగా పరీక్ష తేదీని జూలై 7కి మార్చారు. ప్రతిపాదిత నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ అమల్లోకి వచ్చే వరకు నీట్-పీజీ పరీక్ష ద్వారానే వివిధ ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి దేశవ్యాప్తంగా ఏకైక అర్హత పరీక్షగా నీట్-పీజీ పరీక్షను జాతీయ వైద్య కమిషన్ నిర్వహిస్తున్నది.

విద్యార్థిని చావబాది.. నోట్లో మూత్రం పోసి

ఉత్తరప్రదేశ్‌లో అమానవీయ ఘటన

కాన్పూర్: ఉత్తరప్రదేశ్‌లో మరో అమానవీయ ఘటన జరిగింది. ఓ విద్యార్థిని కిడ్నాప్ చేసిన హెడ్‌కానిస్టేబుల్ సహా డజనుమంది అతడిని చావబాది ఆపై ఒకరితర్వాత ఒకరిగా అతడి నోట్లో మూత్రం పోసి తాగించారు. అంతటితో ఆగక చెప్పులపై ఉమ్మివేసి నాకించారు. కాన్పూరులో జరిగిన ఈ ఘటన తీవ్ర సంచలనమైంది. ఎంసీఏ విద్యార్థి ఆయుష్ ద్వివేది (23) తన స్నేహితుడితో కలిసి ఓ స్నేహితురాలిని కలిసేందుకు వెళ్లిన సమయంలో కొందరు దుండగులు తుపాకి గురిపెట్టి అతడిని కిడ్నాప్ చేసి ఈ దారుణానికి పాల్పడ్డారు. పాతకక్షల నేపథ్యంలోనే ఈ ఘటన జరిగినట్టు పోలీసులు తెలిపారు.

దక్షిణ కొరియాలో కుక్క మాంసంపై నిషేధం

సియోల్, జనవరి 9: దేశంలో కుక్క మాంసం వినియోగాన్ని నిషేధిస్తూ దక్షిణ కొరియా పార్లమెంట్ కీలక బిల్లును ఆమోదించింది. తాజా బిల్లు ప్రకారం.. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారికి గరిష్ఠంగా రెండేండ్ల జైలు శిక్ష లేదా సుమారు రూ.19 లక్షల జరిమానా విధిస్తారు. మూడేండ్ల గ్రేస్ పీరియడ్ తర్వాత 2027 నుంచి ఈ చట్టం అమలులోకి రానున్నది. జంతు ప్రేమికులు తాజా నిర్ణయంపై హర్షం వ్యక్తంచేశారు.

డిప్యూటీ సీఎంగా ఉదయనిధి స్టాలిన్?

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను ఉపముఖ్యమంత్రిగా నియమిస్తారని జోరుగా ప్రచారం సాగుతున్నది. సీఎం స్టాలిన్ వచ్చే నెలలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆ లోగానే స్టాలిన్ స్థానంలో ఉదయనిధి విధులు నిర్వహించడానికి రంగం సిద్ధం చేస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 21న జరిగే యాత్ వింగ్ సమావేశంలో ఈ నిర్ణయం ప్రకటిస్తారని భావిస్తున్నారు. అయితే తనను డిప్యూటీ సీఎంను చేస్తారన్న వార్తలను ఉదయనిధి కొట్టివేశారు.

'100% జాబ్ గ్యారెంటీ' అంటూ ప్రకటనలొద్దు

కోచింగ్ సెంటర్లకు మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, జనవరి 9: '100 శాతం సెలక్షన్ లేదా 100 శాతం జాబ్ గ్యారంటీ లేదా ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల క్వాలిఫై గ్యారంటీ' అంటూ ప్రకటనలు చేయకూడదని కోచింగ్ సెంటర్లకు కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. అభ్యర్థులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఇవ్వడం ఆపాలని సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ఆదేశించింది. ఈ మేరకు ముసాయిదా మార్గదర్శకాలు జారీచేసింది.

5 లక్షల మంది జవాన్లను కోల్పోయిన ఉక్రెయిన్

కీవ్, జనవరి 9: రష్యాతో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఉక్రెయిన్ భారీగా నష్టపోయిందని, నష్టపోతూనే ఉందని ఉక్రెయిన్ దేశీయ వ్యవహారాల శాఖ మాజీ హెడ్ యురియ్ లుట్సెంకో వెల్లడించారు. ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు షాకింగ్ విషయాలు తెలిపారు. 2022 ఫిబ్రవరిలో ఈ రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ నెలకు 30 వేల మంది చొప్పున సుమారు 5 లక్షల మంది సైనికులను నష్టపోయిందన్నారు.

ఫ్రాన్స్ తొలి 'గే' ప్రధానిగా గాబ్రియెల్

పారిస్, జనవరి 9: ఫ్రాన్స్ నూతన ప్రధానిగా 34 ఏండ్ల గాబ్రియెల్ అట్టల్ నియమితులయ్యారు. ఈ పదవి చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడు, తొలి గే వ్యక్తిగా అట్టల్ నిలిచారు. పెన్షన్, వలస నిబంధనల్ని మరింత కఠినతరం చేస్తూ మాక్రాన్ సర్కార్ సంస్కరణలకు తెరలేపటాన్ని వ్యతిరేకిస్తూ దేశ ప్రధాని పదవికి ఎలిసాబెత్ బోర్న్ సోమవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

రైతులు 'షో' చేస్తున్నారు!

అన్నదాతల ఆందోళనలపై గోవా సీఎం అనుచిత వ్యాఖ్యలు

పనాజీ: బీజేపీ పాలిత గోవాలో చెరకు రైతుల ఆందోళనలపై రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. రాజధాని పనాజీలో ఆందోళనలు చేయడం ద్వారా వారు 'షో' చేస్తున్నారంటూ నోరుపారేసుకొన్నారు. మూడేండ్లుగా చెరకు పండించకుండానే ఇంట్లో కూర్చొంటున్న రైతులకు పరిహారం రూపంలో పెద్దమొత్తంలో డబ్బు అందుతున్నదంటూ రైతులను అవమానించేలా మాట్లాడారు. పనాజీకి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధార్‌బందోరాలోని చక్కెర ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించాలని రైతులు ఆందోళన చేపడుతున్నారు.

అమెరికా లూనార్ మిషన్ విఫలం!

న్యూయార్క్: దాదాపు 50 ఏండ్ల తర్వాత చంద్రుడిపైకి అమెరికా చేపట్టిన మూన్ మిషన్ విఫలమైనట్టు కనిపిస్తున్నది. ప్రయోగం జరిగిన 24 గంటల్లోనే 'పెరిగ్రిన్ స్పేస్‌క్రాఫ్ట్'లో ఇంధన లీకేజ్ సమస్య తలెత్తినట్టు సైంటిస్టులు గుర్తించారు. ఇంధన ట్యాంక్‌లో తీవ్ర సమస్య తలెత్తిందని, రాకెట్, స్పేస్‌క్రాఫ్ట్ ల్యాండర్‌ను తయారుచేసిన ప్రైవేట్ కంపెనీ 'ఆస్ట్రోబోటిక్ టెక్నాలజీస్' మంగళవారం ప్రకటించింది. చంద్రుడిపై 'పెరిగ్రిన్' సాఫ్ట్ ల్యాండ్ జరిపే అవకాశం లేదని, స్పేస్‌క్రాఫ్ట్‌పై గ్రౌండ్‌స్టేషన్ నియంత్రణ కోల్పోయిందని కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ మిషన్‌కు సంబంధించి మరికొద్ది గంటల్లో స్పష్టత వస్తుందని పేర్కొన్నాయి.

కుమారుడిని చంపి.. బ్యాగులో కుక్కి

- కొడుకు మృతదేహంతో ట్యాక్సీలో గోవా నుంచి కర్ణాటకకు ప్రయాణం
- కన్నబిడ్డపై దారుణానికి పాల్పడ్డ ఓ స్టార్టప్ కంపెనీ మహిళా సీఈవో

పనాజీ, జనవరి 9: బెంగళూరుకు చెందిన ఓ స్టార్టప్ కంపెనీ సీఈవో నాలుగేండ్ల కుమారుడిని కిరాతకంగా హత్య చేసింది. మృతదేహాన్ని బ్యాగ్‌లో కుక్కి, ట్యాక్సీలో గోవా నుంచి కర్ణాటకలోని బెంగళూరు వరకు ప్రయాణించింది. ఈ దారుణ ఘటన సోమవారం చోటుచేసుకొన్నదని గోవా పోలీసులు మంగళవారం వెల్లడించారు. పోలీసులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి.. 39 ఏండ్ల నిందితురాలు సుచన సేథ్‌ను కర్ణాటకలోని చిత్రదుర్గలో సోమవారం రాత్రి అరెస్టు చేశారు. మంగళవారం ఆమెను గోవా తీసుకొచ్చి స్థానిక కోర్టులో హాజరుపర్చగా.. ఆరు రోజుల కస్టడీకి అప్పగించింది. భర్త వెంకట్ రామన్‌తో సుచన సేథ్ కొన్నేండ్లుగా దూరంగా ఉంటుంది. వీరిద్దరు విడాకుల కోసం దరఖాస్తు చేసుకొన్నట్టు సమాచారం. భర్తతో విభేదాల కారణంగానే సుచన సేథ్ కుమారుడిని చంపి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే అసలు కారణం దర్యాప్తు తర్వాత వెల్లడవుతుందని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఉత్తర గోవాలోని కందోలిమ్‌లో ఓ రెంటెడ్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో ఈ నెల 6న దిగిన సుచన సేథ్.. సోమవారం ట్యాక్సీలో కర్ణాటక వెళ్లింది. అయితే ఆ సమయంలో ఆమెతో పాటు తన కుమారుడు కనిపించకపోవడం, పెద్ద బరువైన బ్యాగ్‌ను మోసుకుంటూ తీసుకెళ్లడంతో అనుమానం వచ్చిన అపార్ట్‌మెంట్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారని కలంగుట్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ పరేశ్ నాయక్ వెల్లడించారు.

వేగంగా స్పందించిన పోలీసులు

కుమారుడిని హత్య చేసిన ఆ కసాయి తల్లి కట్టు కథలు అల్లింది. వారు ఉన్న ఫ్లాట్‌ను పోలీసులు పరిశీలించారు. అక్కడ కనిపించిన రక్తపు మరకలపై పోలీసులు బెంగళూరు వెళ్తున్న ఆమెకు ఫోన్ చేసి ప్రశ్నించగా.. అవి తన నెలసరి వల్ల పర్పడ్డాయని, కుమారుడు తన స్నేహితురాలి వద్ద ఉన్నాడని చెప్పుకొచ్చింది. ఒక అడ్రస్ కూడా ఇచ్చింది. అయితే అది ఫేక్ అని తేల్చిన పోలీసులు బెంగళూరుకు వెళ్తున్న ట్యాక్సీ డ్రైవర్‌కు ఇన్‌స్పెక్టర్ పరేశ్ నాయక్ ఫోన్ చేసి మాట్లాడారు. అప్పటికి వాళ్లు చిత్రదుర్గకు చేరుకోగా.. అనుమానం రాకుండా ఆమెను సమీప పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ బ్యాగ్‌ను చిత్రదుర్గ పోలీసులు పరిశీలించగా.. అందులో బాలుడి మృతదేహం ఉన్నది. వెంటనే కలంగుట్ నుంచి చేరుకొన్న పోలీసు బృందం నిందితురాలిని అదుపులోకి తీసుకొన్నది.

ప్రముఖ గాయకుడు రషీద్ ఖాన్ ఇకలేరు

కోల్‌కతా, జనవరి 9: ప్రముఖ గాయకుడు, హిందూస్థానీ సంగీతకారుడు ఉస్తాద్ రషీద్ ఖాన్(55) మంగళవారం కోల్‌కతాలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన నాలుగేండ్లుగా ప్రొస్టేట్ క్యాన్సర్‌తో పోరాడుతున్నారు. రామ్‌పూర్-సహస్వాన్ సంగీత పాఠశాల వ్యవస్థాపకుడైన ఇనాయత్ హుస్సేన్‌కు రషీద్ ఖాన్ ముని మనుమడు. రషీద్ ఖాన్ మృతి దేశానికి, సంగీత సమాజానికి తీరని నష్టమని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంతాపం వ్యక్తం చేశారు. రషీద్ ఖాన్ మరణించిన విషయాన్ని తానింకా నమ్మలేకపోతున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆమె చెప్పారు.

కేంద్రమంత్రులుగా మాజీ సీఎంలు?

ఎన్నికల ముందు బీజేపీ భారీ వ్యూహం

న్యూఢిల్లీ, జనవరి 9: లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రంలోని బీజేపీ సర్కారు కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్టు తెలుస్తున్నది. నలుగురు మాజీ ముఖ్యమంత్రులను ప్రధాని మోదీ తన క్యాబినెట్‌లోకి తీసుకోవాలని భావిస్తున్నట్టు నేషనల్ మీడియాలో వార్తలు గుప్పుమన్నాయి. మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధరా రాజే, మహారాష్ట్ర మాజీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామిని కేంద్ర క్యాబినెట్‌లోకి తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. కుమారస్వామి మినహా మిగతా ముగ్గురు బీజేపీ వ్యక్తులే. కర్ణాటకలో ఇటీవల బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకోవటంతో ఆ పార్టీ నేత కుమారస్వామిని కూడా కేంద్ర క్యాబినెట్‌లోకి తీసుకోవాలని బీజేపీ భావిస్తున్నట్టు తెలిసింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లో సీట్లతోపాటు ఓటు బ్యాంకును పెంచుకొనేందుకే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు భావిస్తున్నారు. మరోవైపు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ గెలిచినప్పటికీ సీఎం పదవులు ఆశించిన వసుంధర, శివరాజ్‌సింగ్‌ను బీజేపీ అధిష్ఠానం పక్కనబెట్టింది. దీంతో వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని సమాచారం.

లక్షద్వీప్‌లో కొత్త విమానాశ్రయం

- కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు
- మరింత మంది పర్యాటకులను పంపండి
- భారత్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో చైనాను కోరిన మాల్దీవుల అధ్యక్షుడు
- మాయిజ్జు సర్కారుపై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్షాల యోచన

భారత్ పర్యటనకు మాయిజ్జు?

భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపర్చుకునేందుకు మాల్దీవులు చర్యలు చేపట్టింది. అధ్యక్షుడు మాయిజ్జు త్వరలో భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారు! ప్రస్తుతం మాల్దీవుల అధికారులు అధ్యక్షుడి ఢిల్లీ పర్యటనను ఖరారు చేస్తున్నట్టు సమాచారం. ఈ నెలాఖరు లేదా ఫిబ్రవరి మొదటివారంలో ఆయన భారతదేశంలో పర్యటిస్తారని వార్తా కథనాలు వెలువడ్డాయి. మాయిజ్జు ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నారు. పుజియాన్ ప్రావిన్స్‌లో మాల్దీవుల బిజినెస్ ఫోరంలో ఆయన మాట్లాడుతూ, చైనా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌పై ప్రశంసలు కురిపించారు. అలాగే చైనా నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చేట్టు చర్యలు చేపట్టాలని జీ జిన్‌పింగ్ ప్రభుత్వాన్ని మాయిజ్జు కోరారు. టూరిజం జోన్ అభివృద్ధి నిమిత్తం చైనాతో 50 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్నారు.

న్యూఢిల్లీ, జనవరి 9: భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతూ మాల్దీవుల డిప్యూటీ మంత్రులు చేసిన వ్యాఖ్యలు ఇరు దేశాల సంబంధాల్ని తీవ్రంగా కుదిపేస్తున్నాయి. ఈ క్రమంలో లక్షద్వీప్‌లో పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించేందుకు ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. మినికోయ్‌లో విమానాశ్రయాన్ని నెలకొల్పనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు, మాయిజ్జు సర్కార్ తీరుపై ఆ దేశ ప్రతిపక్షాలు, మాలీవులు పర్యాటక అసోసియేషన్లు మండిపడుతున్నాయి. అత్యంత మిత్ర దేశం భారత్‌తో వ్యవహరించే తీరు ఇది కాదని చివాట్లు పెడుతున్నాయి. డిప్యూటీ మంత్రుల వ్యాఖ్యల్ని ఖండిస్తూ మాల్దీవులు అసోసియేషన్ ఆఫ్ టూరిజం ఇండస్ట్రీ, ట్రావెల్ ఏజెంట్స్, టూర్ ఆపరేటర్స్ భారత్‌కు క్షమాపణలు చెప్పాయి. ఆపద సమయంలో మాల్దీవులను ఆదుకునే '911 కాల్' భారత్.. అంటూ ప్రధాన ప్రతిపక్షం ఎంఎన్‌పీ నాయకురాలు మరియా అహ్మద్ దీదీ అన్నారు. విదేశాంగ విధానంలో స్థిరత్వం లోపించిందని, అధ్యక్షుడు మాయిజ్జుపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఎంపీ అజీం అలీ అన్నారు. అధికార పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాయిజ్జుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఆయన ప్రతిపక్ష పార్టీలను కోరారు.

భారత్ అతిపెద్ద మార్కెట్

చిన్న చిన్న దీవుల సముదాయం మాల్దీవులు. దేశ జీడీపీలో మూడోవంతు పర్యాటకం నుంచే వస్తున్నది. 44వేలమందికి ప్రత్యక్షంగా ఉపాధి చూపుతున్నది. గతకొన్నేండ్లుగా మాల్దీవుల పర్యాటకానికి భారత్ అతిపెద్ద మార్కెట్‌గా మారింది. కరోనా సంక్షోభ సమయంలోనూ 66వేల మంది భారతీయులు ఆ దేశాన్ని సందర్శించారు. 2023లో 2,09,198 మంది, 2022లో 2,40,000 మంది, 2021లో 2,11,000 మంది భారతీయులు మాల్దీవుల్లో పర్యటించారు.

అయోధ్య రామమందిరంలో ఏర్పాటు చేసిన తొలి బంగారు తలుపు

రామమందిరం కోసం 32 ఏండ్లుగా మౌనవ్రతం

ధన్‌బాద్: అయోధ్యలో రామమందిరం నిర్మించాలని ఓ మహిళ 32 ఏండ్లుగా మౌనవ్రతం చేస్తున్నారు. జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌కు చెందిన సరస్వతి దేవి (85).. బాబ్రీ మసీదు కూల్చివేసిన రోజు (1992, డిసెంబర్ 6) నుంచి మౌనవ్రతాన్ని కొనసాగిస్తున్నారు. 'మౌనీ మాత'గా ఫేమస్ అయిన ఈమె.. ఎవరితో ఏదైనా చెప్పాలంటే సంజ్ఞలతోనే చెప్పేవారు. 2020 వరకు ప్రతి రోజు ఒక గంట మాట్లాడేవారు. 2020లో రామమందిరానికి పునాది వేసిన రోజు నుంచి పూర్తిగా మౌనవ్రతం చేపట్టారు. అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ అనంతరం దీక్ష విరమించనున్నారు. అయోధ్య పురవీధుల్లో ఈ నెల 17న రామ్‌లల్లా విగ్రహాన్ని ఊరేగించాలన్న నిర్ణయంపై రామజన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు వెనక్కి తగ్గింది. భద్రతా కారణాల రీత్యా ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు తెలిపింది.

యూపీలో మద్యం, విద్యాసంస్థలు బంద్

ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న యూపీలోని అన్ని విద్యాసంస్థలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అలాగే మద్యం దుకాణాలన్నీ మూసేయాలని ఆదేశించింది.

ప్రేమ గుడ్డిది.. గుట్టు వీడింది!

- శాస్త్రీయ కారణాన్ని తేల్చిన ఆస్ట్రేలియా పరిశోధకులు

సిడ్నీ: ఎప్పుడు ఎవరు.. ఎవరితో ప్రేమలో పడతారో తెలియదు. అందుకే ప్రేమ గుడ్డిది అని పెద్దలు అంటారు. అయితే, ఇందుకు ఓ శాస్త్రీయ కారణం ఉన్నదని ఆస్ట్రేలియా పరిశోధకులు తేల్చారు. మానవ మెదడు ప్రవర్తనా క్రియాశీల వ్యవస్థ, రొమాంటిక్ లవ్ మధ్య ఉన్న సంబంధంపై అధ్యయనం నిర్వహించి ప్రేమ గుడ్డిది ఎందుకైందో డీకోడ్ చేశారు. రొమాంటిక్ లవ్ అనేది మెదడులో మార్పునకు కారణమవుతుందని కనుగొన్నారు. ఎవరితోనైనా ప్రేమలో పడ్డప్పుడు లవ్ హార్మోన్ ఆక్సిటోసిన్ విడుదల కావడమే ఇందుకు కారణమని తేల్చారు. ప్రేమలో ఉన్న 1,556 మంది యుక్త వయస్కులపై పరిశోధకులు అధ్యయనం నిర్వహించారు. భాగస్వామిపట్ల వారి భావోద్వేగ ప్రతిస్పందన, వారి ప్రవర్తన, అన్నింటికీ మించి వారికి ఇష్టమైన వారిపై వారుపెట్టే దృష్టిపై పరిశోధన చేశారు. మనం ప్రేమలో ఉన్నప్పుడు మన మెదడు భిన్నంగా స్పందిస్తుందని, ఈ సమయంలోనే ఎదుటి వ్యక్తిపై ఆప్యాయతలు, అనురాగాలు అమాంతం పెరుగుతాయని కనుగొన్నారు. ప్రేమ గుడ్డిది అనే అంశంపై ప్రపంచంలోనే ఇదే మొదటి పరిశోధన కావడం విశేషం.

లీటర్ బాటిల్‌లో 2,40,000 ప్లాస్టిక్ రేణువులు

- ఆ నీళ్లు తాగితే ఒళ్లంతా ప్లాస్టిక్‌మయమే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు దుకాణాల్లో దొరికే ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసి అందరూ నీళ్ల తాగడం తెలిసిందే. అయితే, అలాంటి లీటర్ బాటిల్ నీటిలో 2,40,000 ప్లాస్టిక్ రేణువులు ఉంటాయని అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు తెలిపారు. ఒక మైక్రో మీటర్ పొడవు, వెంట్రుకలో 17వ వంతు వెడల్పు ఉండే ఈ రేణువులను నానోప్లాస్టిక్ కణాలుగా వ్యవహరిస్తారని అన్నారు. ఇలాంటి నీటిని తాగడం వల్ల కణాల్లోకి నానోప్లాస్టిక్ రేణువులు చేరి జీవక్రియలకు అంతరాయం ఏర్పడవచ్చని, రక్తనాళికల్లో చేరడంతో రక్త ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి గుండెపోటు సమస్యలు తలెత్తవచ్చని హెచ్చరించారు. రక్తంలో ప్లాస్టిక్ చేరడంతో గర్భిణీల్లో పుట్టబోయే బిడ్డలు కూడా ఆరోగ్య సమస్యలు, ఎదుగుదల లోపాలు ఎదుర్కొనే ప్రమాదముంటున్నదని వెల్లడించారు. ఈ వివరాలు 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

హాటెస్ట్ ఇయర్.. 2023

- 1,25,000 సంవత్సరాల్లో గత ఏడాదే అత్యధిక ఉష్ణోగ్రతలు



వాషింగ్టన్: గత ఏడాది భూమిపై స